
● ప్రతి పల్లె పసుపుమయమే..! ● 77 గ్రామాల్లో 68 గ్రామాల్లో టీడీపీకి మెజారిటీ ● కల్లూరు 16 వార్డుల్లోనూ హవా ● కాటసాని అక్రమాలపై విసిగెత్తిన ప్రజలు

● గౌరు చరితకు జైకొట్టిన జనం






అరాచక రాజ్యంలో.. అద్భుత ఫలితం

కబ్జాల ఇలాకాలో కష్టాల సుడిగండం.. ఎటు చూసినా అల్లరి మూకల అరాచకాల పర్వం.. ఎప్పుడు ఎవరు దౌర్జన్యానికి దిగుతారో తెలియని దైన్యం. అటువంటి నియోజకవర్గంలో అద్భుత ఫలితం.. బలమైన క్యాడర్ లేకున్నా మంచితనమే ఆమె ఆయుధమైంది. అనేక ఇబ్బందుల్లోనూ ప్రజలను అంటిపెట్టుకొని ఉండడమే తన విజయానికి సోపానమైంది. బలమైన వర్గం తమకు ఉందంటూ జబ్బలు చరుచుకున్న ప్రత్యర్థిని ఆమె మంచితనమే మట్టి కరిపించింది. సార్వత్రిక ఎన్నికల్లో పాణ్యం నియోజకవర్గంలో టీడీపీ విజయ ఢంకా మోగించింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాలతోపాటు కల్లూరు 16 వార్డుల్లో సైతం టీడీపీ సత్తా చాటింది. పసుపు జెండా ఎగురవేయాలని ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అభిమానుల కోరిక గౌరు చరిత ఆధ్వర్యంలో నెరవేరింది. 40,500 ఓట్ల ఆధిక్యంతో ఆమె విజయం సాధించింది.

కర్నూలు, జూన్ 8: పాణ్యం నియోజకవర్గంలో పాణ్యం, గడివేముల, ఓర్వకల్లు, కల్లూరు మండలాలతో 16 అర్బన్ వార్డులు ఉన్నాయి. పాణ్యం మండలంలో 18 గ్రామాలు, గడివేములలో 17 గ్రామాలు, ఓర్వకల్లులో 22 గ్రామాలు, కల్లూరులో 20 గ్రామాలతోపాటు 16 వార్డులు ఉన్నాయి. ప్రతి మండలంలో మూడు గ్రామాలు మినహాయించి 68 గ్రామాల్లో టీడీపీ విజయబాట ఎగురవేసింది. పాణ్యం మండలంలో పిన్నాపురం, తొగర్చేడు, అనుకూరు, గడివేములలో ఒండుట్ల, బిలకలగూడూరు, ఆళ్లగడ్డ, ఓర్వకల్లులో మీదివేముల, కొంతలపాడు, చింతలపల్లె, కల్లూరులో గోకులపాడు, పుసులూరు, కొంగనపాడు మినహాయించి అన్ని గ్రామాల్లోనూ అత్యధికంగా మెజారిటీ సాధించింది. కల్లూరు మండలం ఉలిందకొండలో, ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లెలో, గడివేముల మండలం గని గ్రామంలో, పాణ్యం మండలం పాణ్యం గ్రామాల్లో వైసీపీ కంటే టీడీపీ అత్యధిక శాతం మెజారిటీ సాధించింది.

బలమైన క్యాడర్ ఉన్నా...

పాణ్యం నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా వైసీపీ, కాంగ్రెస్‌లు ఆధిక్యాన్ని కనబరుస్తున్నాయి. పాణ్యం నియోజకవర్గంలో టీడీపీకి బలమైన క్యాడర్ ఉన్నా సరైన నాయకత్వం లేకపోవడంతో కొంత వెనుకబడాల్సిన పరిస్థితి ఉండింది. పునర్విభజనకు ముందు 1983, 1999లో మాత్రమే టీడీపీ విజయం సాధించింది. ఆ తర్వాత ఎప్పుడూ కూడా టీడీపీ గెలుపొందలేదు. 1999లో టీడీపీ తరఫున బిజ్జం పార్థసారథిరెడ్డి పోటీ చేసి అత్యధిక మెజారిటీ గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో టీడీపీకి దూరం కావడం, పార్టీ తరపున పోటీ చేసేందుకు ఎవరూ కూడా ముందుకు రాకపోవడం వంటి కారణాలతో టీడీపీకి కొంత లోటు కనిపించింది. 2009లో బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పాణ్యం తరపున బరిలో నిలిచిన ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన నియోజకవర్గానికి కూడా దూరమయ్యారు. 2014లో ఏరాసు ప్రతాప్‌రెడ్డి పాణ్యం టీడీపీ తరఫున పోటీ చేసి ఓటమి చవి చూసి ఆయన కూడా నియోజకవర్గానికి దూరమయ్యారు. 2019లో గౌరు చరిత వైసీపీ నుంచి టీడీపీలో చేరి పాణ్యం నుంచి పోటీ చేశారు. ఆమె కూడా ఓడిపోయారు.



పాణ్యం నియోజకవర్గంలో టీడీపీ మెజారిటీ

మండలం	మెజారిటీ
పాణ్యం	3,360
గడివేముల	3,801
ఓర్వకల్లు	3,641
కల్లూరు	4,808
అర్బన్ 16 వార్డులు	23,010

ఓడిపోయినా కూడా

2019లో టీడీపీ తరపున పోటీ చేసి ఓటమి చవి చూసిన గౌరు చరిత ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. రాష్ట్రంలో వైసీపీకి అత్యధిక ప్రాబల్యం ఉన్నా.. టీడీపీ నాయకులపై కేసులు నమోదవుతున్నా, వేధింపులకు గురి చేస్తున్నా కూడా ఆమె మాత్రం వెనక్కు తగ్గలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది టీడీపీ నాయకులు వైసీపీ అరాచకాలను ప్రశ్నించేందుకు ముందుకు రావడానికి భయపడిన తరుణంలో గౌరు చరిత మాత్రం ఏ మాత్రం వెనుకడుగు వేయలేదు. నియోజకవర్గంలోని కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఏ కష్టం వచ్చినా, ఏ ప్రమాదం వచ్చినా ముందుండి వారికి అండగా నిలిచారు. కాటసాని రాంభూపాల్‌రెడ్డి అరాచకాలను సైతం ఎదురొడ్డి పోరాడారు. ఆయన అరాచకాలను ప్రశ్నించడంలో ముందు నిలబడ్డారు. నిత్యం కార్యకర్తలకు ధైర్యం చెబుతూ అండగా ఉండటంతోనే ఈ రోజు ఆమెను విజయం వరించింది. టీడీపీ వస్తే తాను ఏం చేసేదీ పల్లె పల్లెలో హామీ ఇచ్చారు. దీంతో పాటు సౌమ్యురాలు, మృదు స్వభావి కావడంతో పాణ్యం నియోజకవర్గ ప్రజలను ఇట్టే ఆకర్షించారు. వైసీపీలో ఉన్న సమయంలో కూడా ఏనాడూ అరాచకాల జోలికి వెళ్లలేదు.

అర్బన్ వార్డుల్లో సైతం

కల్లూరు అర్బన్ వార్డుల్లో సైతం టీడీపీ మెజారిటీ సాధించింది. 16 వార్డుల్లో 23,017 ఓట్ల మెజారిటీ కైవసం చేసుకుంది. ప్రతి వార్డులో వేయికి పైగా మెజారిటీ దక్కింది. అత్యధికంగా 33వ వార్డులో వైసీపీకి కంటే 36.20 శాతం అత్యధిక మెజారిటీ సాధించింది. ఖాళీ స్థలాల్లో కాటసాని కబ్జాలు, అరాచకాలే వార్డు ప్రజల్ని టీడీపీ వైపు మళ్లించాయి. దీంతోపాటు అర్బన్ వార్డులకు ప్రతి రోజూ తాగునీరు అందిస్తామని గౌరు చరిత హామీ ఇవ్వడంతో వార్డు ప్రజలు కూడా టీడీపీ వైపే మొగ్గు చూపారు.



టీడీపీ మెజారిటీ వివరాలు ఇలా..

● **పాణ్యం మండలం:** పర్ల-882, ఎ.గోకులపాడు- (-1), నెరవాడ -83, సల్కాపురం-344, కె.మార్కాపురం-32, పెద్దకొట్టాల-79, బస్తిపాడు-292, పుసులూరు-(-100), రేమడూరు-180, నాయకల్లు-78, కొంగనపాడు-(-18), చెట్ల మల్లాపురం-01, ఉలిందకొండ-1333, చిన్నటేకూరు-515, యాపర్లపాడు-133, తడకనపల్లె-425, పెద్దటేకూరు-240, బొల్లవరం-118, దూపాడు-162, దొడ్డిపాడు-30 (మొత్తం -4808 ఓట్ల మెజారిటీ వచ్చింది)

● **కల్లూరు అర్బన్ వార్డులో:** వార్డు-19లో 1370, వార్డు 19-20లో 1227, వార్డు-20లో 569 వార్డు-21లో 673, వార్డు 26లో 841, వార్డు 27లో 950, వార్డు 28లో 2126, వార్డు 29లో 1332, వార్డు 30లో 1089, వార్డు-31లో 1068, వార్డు-32లో 2112, వార్డు 33లో 2621, వార్డు-34లో 2381, వార్డు-35లో 1757, వార్డు-36లో 1436, వార్డు-37లో 487, వార్డు 41లో 978 మెజారిటీ వచ్చింది. మొత్తం 23,017 ఓట్లు మెజారిటీ వచ్చింది.


● **ఓర్వకల్లు మండలంలో:** నన్నూరు-323, బైరాపురం-55, లొద్దిపల్లె-240, ఉయ్యాలవాడ-807, మీదివేముల-(-326), పూడిచెర్ల-151, కేతవరం-53, కన్నమడకల-518, ఓర్వకల్లు-346, గుట్టపాడు-123, కొంతలపాడు-(114), ఉప్పలపాడు-118, పాలకొల్లు-65, చింతలపల్లి-(-33), కొమరోలు-60, సోమయాజులపల్లె-474, కాల్వ -(-71), గుడుంబాయితాండా-(-38), హుశేనాపురం-1168, తిప్పాయపల్లె-22, శకునాల-27 బ్రాహ్మణపల్లె-17లో మొత్తం మెజారిటీ 3641 వచ్చింది.

● **గడివేములలో:** మంచాలకట్ట-105, గని-574, ఎల్‌కే తండా-71, ఒండుట్ల-(58), కె.బొల్లవరం-111, గడిగరేవుల-294, చిందుకూరు-257, బూజనూరు-15, గడివేముల-1090, కొర్రపోలూరు-69, బిలకల్ గూడూరు-(-54), ఆళ్లగడ్డ-(-43), పెసరవాయి-444, కర్రిమిద్దెల-492, తిరుపాడు-40, కొరటమద్ది-95, దుర్వేసి-299 ఓట్లతో మొత్తం 3801 మెజారిటీ వచ్చింది.

● **పాణ్యంలో:** పిన్నాపురం-(-37), తమ్మరాజుపల్లె-282, పాణ్యం టౌన్-1662, సుగాలిమెట్ట-98, కొండవీడు-164, కందికాయపల్లె-31, ఆలమూరు-34, గోనవరం-175, భూపనపాడు-261, నెరవాడ-38, కౌలూరు-119, గోరుకల్లు-325, కొండజూటూరు-118, బలపనూరు-210, తొగర్చేడు-(-31), మద్దూరు-38, అనుపూర్-(-256), కొత్తూరు-129 ఓట్లతో మొత్తం 3360 మెజారిటీ వచ్చింది.

కబ్జాలే కొంపముంచాయి..

కాటసాని రాంభూపాల్‌రెడ్డి భూ సెటిల్‌మెంట్లు, అరాచకాలు, కబ్జాలు, ఇసుక, ఎర్రమట్టి మాఫియాతో ఓడిపోయినట్లు తెలుస్తోంది. పాణ్యంలో ప్రతి టెండరులో ఈయనే. కాంట్రాక్టర్లను ఎవరినీ ముందుకు రానివ్వలేదన్న అపవాదు మూట గట్టుకున్నారు. పిన్నాపురం, కందికాయపల్లె సోలార్ పనుల్లో కూడా వీరి వాటా ఉందని తెలుస్తోంది. గనిలోని సోలార్ క్లీనింగ్ పనులను వేరే వాళ్ల నుంచి బలవంతంగా లాక్కున్నట్టు సమాచారం. ఇలా చెప్పుకుంటూపోతే కాటసాని అరాచకాలు అన్నీఇన్నీ కావు. ఇలా ప్రజల్లో గూడుకట్టుకున్న వ్యతిరేకత చివరకు కాటసాని ఓటమికి కారణమైందని తెలుస్తోంది.



గర్భిణులకు ప్రత్యేక ఐసీయూ



గైనిక్ ఐసీయూను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డా.ప్రభాకర్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), జూన్ 8: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనిక్ విభాగంలో పది పడకలతో కొత్తగా ఏర్పాటు చేసిన ఐసీయూ యూనిట్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి, గైనకాలజీ హెచ్‌వోడీ డా. శ్రీలక్ష్మి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ గైనిక్ ఐసీయూ వల్ల గర్భిణుల క్రిటికల్ కేసులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అత్యాధునిక పరికరాలతో ఆరు వెంటిలేటర్లు, సెక్షన్ ఆపరేటర్లు ఈ యూనిట్‌లో అందుబాటులోకి తీసుకుని వచ్చినట్లు తెలిపారు. గైనిక్ విభాగంలో తల్లుల మరణాల శాతాన్ని బాగా తగ్గించాలని వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.హేమనళిని, ఏఆర్ఎంవో డా. వెంకటరమణ, అనస్థీషియా విభాగపు హెచ్‌వోడీ విశాల, ప్రొఫెసర్లు కొండారెడ్డి, సుధీర్, ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ రాంశివ నాయక్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ శివబాల పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీలో అప్‌లోడు చేయండి

గర్భిణులను ఆరోగ్యశ్రీలో అప్‌లోడు చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ప్రభాకర్ రెడ్డి గైనిక్ విభాగపు వైద్యులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం ఆయన గైనిక్ వైద్యులతో సమీక్ష నిర్వహించారు. వైద్యులు సమయపాలన పాటించాలని, ఉత్తమ సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ వెంకటరమణ, గైనిక్ హెచ్‌వోడీ శ్రీలక్ష్మి, వైద్యులు పాల్గొన్నారు.

దంచి కొడుతున్న వానలు

● పదునెక్కిన పొలాలు ● విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధం



పొలంలో పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు



కర్నూలు నగరలో ఇలా..



కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 8: గత వారం రోజులుగా జిల్లాలో వర్షాలు దంచి కొడుతున్నాయి. శనివారం దాదాపు 14 మండలాల్లో వర్షం కురవడంతో పొలాలు పదునెక్కాయి. రైతులు విత్తనాలు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. పత్తికొండలో అత్యధికంగా 60.8 ఎంఎం వర్షం కురిసింది. చిప్పగిరిలో 58.6, తుగ్గలిలో 56.2, మంత్రాలయంలో 52.2, ఓర్వకల్లులో 48.2, కర్నూలు అర్బన్‌లో 22.2, మద్దికెరలో 21.8, ఆస్పరిలో 8.8, కర్నూలు రూరల్‌లో 8.2, మిగిలిన మండలాల్లో 8 నుంచి 2 ఎంఎం దాకా వర్షం కురిసినట్లు అధికారవర్గాలు తెలిపాయి. దీంతో రైతులు తమ పొలాల్లో విత్తనాలు విత్తేందుకు నిమగ్నమయ్యారు.

పదవుల్లో ఉంచుతారా... దించుతారా..?



జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయం

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 8: ఉమ్మడి జిల్లాలో ముఖ్యమైన శాఖలకు సంబంధించి పదవుల్లో ఉన్న వైసీపీ నాయకుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. ముఖ్యంగా మార్కెటింగ్ శాఖ పరిధిలో 15 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. కోడుమూరు, పాణ్యం మార్కెట్ కమిటీలకు చైర్మన్లు, డైరెక్టర్లుగా వైసీపీకి చెందిన నాయకులే కొనసాగుతున్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో ఆయా మార్కెట్ కమిటీల చైర్మన్లు, డైరెక్టర్లకు పదవీ గండం పొంచి వుంది. ఇప్పటికే ముఖ్యమైన మార్కెట్ కమిటీలకు సంబంధించి చైర్మన్, డైరెక్టర్ల పదవులను దక్కించుకునేందుకు తెలుగుదేశం పార్టీకి చెందిన ముఖ్య నాయకులు ఎమ్మెల్యేలను ఆశ్రయించినట్లు విశ్వసనీయ సమాచారం అందింది. మార్కెట్ కమిటీల చైర్మన్లు, డైరెక్టర్లకు ఇంకా కొద్ది నెలలపాటు పదవుల్లో కొనసాగే అవకాశాన్ని గత వైసీపీ ప్రభుత్వం కల్పించింది. అయితే.. నామినేటెడ్ పదవుల్లో ఉన్న వీరిని తక్షణమే మార్చేందుకు టీడీపీ ప్రభుత్వం అవసరమైన చర్యలు ఇప్పటికే చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ పదవుల్లో ఉన్న వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీ ఉత్తర్వులు జారీ చేయకముందే తమ పదవులకు రాజీనామాలు చేసి స్వచ్ఛందంగా కొనసాగుతారో లేక తమకు ఇంకా అవకాశం ఉందని అలాగే పదవుల్లో కొనసాగుతారో తెలియడం లేదు. వారు పదవుల్లో కొనసాగాలని నిర్ణయించుకున్నా టీడీపీ ప్రభుత్వం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని కొనసాగించే అవకాశం లేదని ప్రస్తుత పరిస్థితులను బట్టి తేటతెల్లమైపోయింది. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల, ఆత్మకూరు, బనగానపల్లె, నందికొట్కూరు, పత్తికొండ, ఆలూరు, డోన్ తదితర ముఖ్యమైన మార్కెట్ కమిటీల్లో చైర్మన్లుగా, డైరెక్టర్లుగా పదవులు సాధించుకునేందుకు టీడీపీ ముఖ్య నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

డీసీసీ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్న వైసీపీకి చెందిన ఎస్వీ విజయ మనోహరి శనివారం తన పదవికి రాజీనామా చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో కర్నూలు జిల్లాలో కీలకమైన నాయకుడిగా మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి కొనసాగారు. దీంతో అప్పటి సీఎం జగన్ ఈ పదవిని ఎస్వీ సతీమణి విజయ మనోహరికి ఇచ్చారు. రైతులకు ఏటా వందల కోట్ల రూపాయల రుణాలు ఇప్పించే అవకాశం ఆ పదవికి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఈ పదవిపై ఉమ్మడి జిల్లాలోని తెలుగుదేశం పార్టీకి చెందిన ముఖ్య నాయకులంతా ఆశలు పెట్టుకున్నారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో 96 వ్యవసాయ సహకార సంఘాలకు అప్పటి వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేల సిఫారసుతో ఆ పార్టీకి చెందిన నాయకులే చైర్మన్లుగా డైరెక్టర్లగా కొనసాగుతున్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ మాదిరిగానే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో కొనసాగుతున్న చైర్మన్లు, డైరెక్టర్లు సంఘాల ప్రెసిడెంట్లు వారంతకు వారే పదవి నుంచి దిగిపోతారా లేక వారిని టీడీపీ ప్రభుత్వం వెంటనే దిగిపోయేలా ఉత్తర్వులు జారీ చేస్తుందా అన్న విషయంపై తీవ్ర ఉత్కంఠత నెలకొంది.

ఈ విజయం చారిత్రాత్మకం: గౌరు జనార్దన్‌రెడ్డి



గౌరు జనార్దన్‌రెడ్డిని అభినందిస్తున్న పెద్దపాడు టీడీపీ నాయకుడు తిరుమలేశ్వరరెడ్డి

కల్లూరు జూన్ 8: పాణ్యం నియోజకవర్గం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గౌరు చరితరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించడం చారిత్రాత్మక విజయమని టీడీపీ యువ నేత గౌరు జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం గౌరు చరితరెడ్డి విజయాన్ని పురస్కరించుకుని గౌరు చరిత కుమారుడు, టీడీపీ యువ నాయకుడు గౌరు జనార్దన్‌రెడ్డిని కల్లూరు అర్బన్ 36వ వార్డు ఇన్‌చార్జి ఆర్. తిరుమలేశ్వరరెడ్డి పెద్దపాడులో సన్మానించారు. ఈ సందర్భంగా గౌరు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి మేనిఫెస్టోను ప్రజలు ఆదరించడం వల్లనే ఈ విజయం సాధ్యమైందన్నారు. తమ గెలుపునకు తోడ్పాటు అందించిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, టీడీపీ నాయకులు ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, పెద్ద బీచుపల్లి, చిన్న బీచుపల్లి పాల్గొన్నారు.

బాధితులకు గౌరు దంపతుల పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న గౌరు దంపతులు

ఓర్వకల్లు, జూన్ 8: వైసీపీ దాడిలో గాయపడిన బాధితులను నంది కొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితలు పరామర్శించారు. మండలంలోని మీదివేముల గ్రామంలో శుక్రవారం వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తలు నాగరాజు, తిరుపాలు, శ్రీనివాసులు, రమేష్, వెంకటేశ్వర్లుపై దాడి చేశారు. దీంతో వారు కర్నూలులోని అమ్మ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. వీరిని శనివారం గౌరు దంపతులు పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

నీట్‌లో రాణించిన సాత్విక్



కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 8: కర్నూలు నగరానికి చెందిన బలగారి సాత్విక్ ఇటీవల విడుదలైన 'నీట్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపారు. 690/720 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 4,273 ర్యాంక్ దక్కించొని మెడిసిన్‌లో సీటు సొంతం చేసుకున్నారు. కల్లూరులోని బృందావన్ నగర్‌లో ఉంటున్న బాలగారి సుందర్‌రావు, దండు సునీత దంపతులు ఇద్దరు కూడా ఉపాధ్యాయులే. వారి కుమారుడు బాలగారి సాత్విక్ పదో తరగతి పరీక్షలో 591/600 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. విజయవాడలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల గోశాల క్యాంపస్ ఇంటర్‌లో చేరారు. 984/1000 మార్కులు సాధించాడు. నీట్ పరీక్ష ఫలితాల్లో మెరుగైన మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నాడు. తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

'కార్పొరేటర్ పరమేష్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సుంకన్న

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 8: కర్నూలు 8వ వార్డు కార్పొరేటర్, టీడీపీ ఫ్లోర్ లీడర్ కురువ పరమేష్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని బీసీ భవన్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాదాసి, మాదారి కురువ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుంకన్న, మాదాసి కురువ రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, ప్రజా పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు కె.బలరాం, రాయలసీమ యువజన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వీవీ నాయుడు మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొని టీడీపీ జెండాను భుజాన మోసిన నిఖార్సయిన నాయకుడు పరమేష్ అన్నారు. కార్యక్రమంలో జయప్రకాష్, సురేంద్ర, సీతారాము, భీమన్న, లక్ష్మన్న, తిప్పన్న పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(న్యూసిటీ), జూన్ 8: ఈనెల 29న బక్రీద్‌ను పురస్కరించుకుని వ్యర్థాల సేకరణకు నగర పాలక సంస్థకు పాలీ ప్రొపెలీన్ బ్యాగుల సరఫరా చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 వేల బ్యాగులను సరఫరా చేసేందుకు దరఖాస్తులను పని వేళల్లో కార్యాలయాల్లో అందజేయాలని ఆయన పేర్కొన్నారు.

కర్నూలు నగరంలో జోరు వాన

» లోతట్టు కాలనీలు జలమయం

» ఇబ్బందులు పడిన ప్రజలు

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 8: వరుసగా కురుస్తున్న వానకు కర్నూలు, కల్లూరు నగరంలోని లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. అశోక్‌నగర్, డీమార్టు ఏరియా, కొత్తబస్టాండుకు వెళ్లే కేసీ కెనాల్ బ్రిడ్జి కింద, కల్లూరులో బ్రిడ్జి ప్రాంతంతోపాటు లోతట్టు కాలనీల్లో నీటి నిల్వ చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. చెత్తా చెదారం కాలువల్లో పేరుకుపోవడంతో లోతట్టు కాలనీల్లోని మురు గునీరు బయటకు పోయే దారి లేక రోడ్లపై ఏరులై పారు తోంది. దీంతో ఆయా కాలనీల్లోని ప్రజలు దుర్వాసన భరించలేక దోమల బెడదతో రోగాలపాలయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే యుద్ధప్రాతిపదికన కాలువలను శుభ్రం చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు



ఆర్ఎస్ రోడ్డులో నిలిచిన వర్షం నీరు



వెంకటేష్ థియేటర్ వద్ద..



వై.ఎస్ఆర్ సర్కిల్ వద్ద..

చిన్నారులకు టీకాలు వేయించాలి



వ్యాక్సినేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు(హాస్పిటల్), జూన్ 8: చిన్నారులు, గర్భిణులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన శ్రీరామ్‌నగర్, జోహారాపురం-2 అర్బన్ హెల్త్ సెంటర్లలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. వ్యాక్సిన్ రిపో ర్టులు, రికార్డులను తనిఖీ చేశారు. చిన్నారులు, గర్భిణులకు సమయా నుసారంగా వ్యాక్సిన్ ఇవ్వాలని, ఎంఆర్-2, ఎంఆర్-2 వ్యాక్సిన్‌లు వంద శాతం పూర్తి చేయాలని ఆ వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఏఎన్ఎంలు, ఏపీ హెల్త్ యాప్, ఎంసీపీ కార్డులో గర్భిణుల వివరా లను నమోదు చేయాలన్నారు. ప్రమాదకర చిహ్నాలు గుర్తించి వారికి కాన్పు తేదీకి 3 రోజులు ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి సుఖ ప్రసవం అయ్యేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో యుపీహెచ్‌సీ శ్రీరామ్‌నగర్ వైద్యాధికారి దివ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడి మృతి

కర్నూలు, జూన్ 8: నగరంలో బంగారుపేట సమీపంలో రైల్వే ట్రాక్ దాటుతున్న గుర్తు తెలియని యువకుడిని రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ యువకుడు అక్కడి కక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. మృతుడి శరీరంపై నలుపు రంగు టీషర్టు, దానిపైన పింక్ కలర్ అడ్డ గీతలు ఉన్నాయి. గ్రేక లర్ కాటన్ జీన్స్ పాయింటు ధరించి ఉన్నాడు. మృతుడి వయస్సు 30 ఏళ్లలోపు ఉంటుందని పోలీసులు భావిస్తు న్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9441970940 నెంబరుకు ఫోన్ చేయాలని హెడ్ కానిస్టేబుల్ కోదండరాముడు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించారు.

గౌరు చరితకు అభినందనలు

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 8: నగరంలోని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగళ్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఏపీ ఎన్జీవోస్ నాయకులు టీడీపీ పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, టీడీపీ సీనియర్ నాయకుడు గౌరు వెంకటరెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జవహర్, నగర అధ్యక్షుడు కాశన్న, కార్యదర్శి రామకృష్ణ, రవి ప్రకాష్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్ రెడ్డి, చిరం జీవి, రాఘవేంద్ర, మద్దయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కర్నూలు(ఎడ్యుకేషన్): పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, టీడీపీ సీనియర్ నాయకుడు గౌరు వెంకటరెడ్డిలను కర్నూలు జిల్లా ఆప్టా నాయకుడు ఖాజా హుశేన్‌తో కలిసి బృందం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ గత పాలనలో టీచర్లు ఎదుర్కొన్న సమస్యలన్నింటిని పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఎన్నికలలో తనకు మద్దతు ఇచ్చిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆప్టా నాయకులు ఖాజా హుశేన్, మునగాల మధుసూదన్ రెడ్డి, సేవాలాల్ నాయక్, లక్ష్మనాయక్, దేవమడ మధుసూదన్ రెడ్డి, మహబూబ్‌బాషా, గోపాల్, రఫీ, నాగరాజు, శేషు పాల్గొన్నారు.



గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన కొత్రపోలూరు సర్పంచ్ మాలిక్ బాషా







గౌరు దంపతులను అభినందిస్తున్న ఏపీ ఎన్జీవో, ఆప్టా నాయకులు, ఓర్వకల్లు టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డిని సన్మానిస్తున్న గౌరు దంపతులు

టీడీపీతోనే అభివృద్ధి: గౌరు చరిత

కల్లూరు: తెలుగుదేశం ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శనివారం గడివేముల మండలం కొత్రపోలూరు గ్రామ సర్పంచు మాలిక్‌బాషాతో పాటు 20 కుటుంబాలు గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ కండు వాలు వేసి కప్పి గౌరు దంపతులు వారిని పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ మాలిక్‌బాషా మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్ర మంలో టీడీపీ మండల అధ్యక్షుడు దేశం సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోవిందరెడ్డి సేవలు మరువరానివి

ఓర్వకల్లు: ఓర్వకల్లు టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి సేవలు మరువరానివని నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శనివారం నగరంలోని గౌరు నివాసంలో గోవిందరెడ్డిని పూలమాలలతో, శాలువలతో గౌరు దంపతులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవిందరెడ్డి 9 సంవత్సరాలుగా టీడీపీకి చేస్తున్న సేవలను గుర్తించి సన్మానించామన్నారు. నాయకులు రాంభూపాల్ రెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, అల్లాబాబు, అయ్య స్వామి, నాగరాజు పాల్గొన్నారు.

గౌరు చరిత ప్రసన్నం కోసం అధికారుల తహతహ

» వైసీపీతో అంటకాగిన అధికారుల గుండెల్లో గుబులు

» టీడీపీ నాయకులతో రాయబారాలు

కల్లూరు, జూన్ 8: పాణ్యం ఎమ్మెల్యేగా భారీ విజయం సొంతం చేసుకున్న గౌరు చరితను ప్రసన్నం చేసుకునేందుకు అధికారులు తహతహలాడుతున్నారు. తాము కోరుకున్న స్థానంలో విధుల్లో కొనసాగేలా చూడాలని స్థానిక టీడీపీ నాయకులకు ఫోన్లు చేస్తూ ఎమ్మెల్యేతో మాట్లాడించాలని ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరుల పనులను చేయకుండా ముప్పుతిప్పలు పెట్టిన అధికారులకు త్వరలో ఉద్వాసన పలకనున్నట్లు తెలుస్తోంది. జగన్ పాలనలో అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించిన వారు తిరిగి టీడీపీ స్థానిక నాయకులపై ఒత్తిడి తెస్తూ పాణ్యం ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా పదుల సంఖ్యలో పోలీసులు, వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఆరోగ్య అధికారులు తమకు తెలిసిన స్థానిక టీడీపీ నాయకులతో రాయబారాలు నడుపుతున్నట్లు సమాచారం.

శివారు కాలనీల సమస్యలు పరిష్కరించాలి

కల్లూరు, జూన్ 8: కల్లూరు అర్బన్ పరిధిలోని శివారు కాలనీ సమస్యలను పరిష్కరించాలని పట్టణ పౌరసంక్షేమం సంఘం నాయకుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కల్లూరు అర్బన్ సత్యకీర్తి నగర్‌లో డిప్యూటీ మెయర్ ఉన్నా ఈ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. వర్షం వచ్చిందంటే పరిసరాల్లో నీరు చేరి ప్రజలు అవస్థలు పడుతున్నారని అన్నారు. కాలనీల్లో మౌలిక వసతులు కల్పించకపోతే నగ పాలక సంస్థ కార్యాలయం ముందు ధైరాయిస్తామన్నారు. అధికారులు స్పందించి సత్యకీర్తి నగర్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరారు.

సుంకేసుల చెక్‌పోస్ట్ తనిఖీ



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ

గూడూరు, జూన్ 8: గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని సుంకేసుల చెక్‌పోస్టును శనివారం గూడూరు ఎస్ఐ హనుమంతయ్య తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సుంకేసుల చెక్‌పోస్టు దగ్గర ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు.

గొడవలకు పాల్పడితే చర్యలు: గ్రామాల్లో ఎవరైనా గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని గూడూరు ఎస్ఐ హనుమంతయ్య హెచ్చరించారు. శనివారం గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రేమట గ్రామంలో గూడూరు ఎస్ఐ హనుమంతయ్య పోలీసులతో పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామస్థులంతా కలిసి మెలిసి జీవించాలన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 8: నూతన ప్రభుత్వం విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కే.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రవికుమార్ కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం పాఠశాల విద్యను బలోపేతానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని, 117 జీవో రద్దు చేయాలని, పీఆర్సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, దావీదు, సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, ఆర్థిక కార్యదర్శి యేహోషువా, జిల్లా కార్యదర్శి తిమ్మన్న, దుర్గాప్రసాద్, కాశీం, జయరాజు, గాదెలింగప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గిడ్డాంజనేయస్వామి ఆలయంలో పూజలు



టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లిస్తున్న టీడీపీ శ్రేణులు

కోడుమూరు(రూరల్), జూన్ 8: మండలంలోని వెంకటగిరి గ్రామంలోని గిడ్డాంజనేయస్వామి ఆలయంలో శనివారం టీడీపీ యువనాయకుడు రాజు అధ్వర్యంలో స్వామివారి ఆలయం ఎదుట 101 టెంకాయలు కొట్టి పూజలు చేశారు. రాజు మాట్లాడుతూ కోడుమూరు కోటపై టీడీపీ జెండా ఎగురవేయాలని దివంగత ఎంపీపీ రాజవర్ధన్‌రెడ్డి కల అని అన్నారు. జిల్లాలోనే అత్యధికంగా 21,583 మెజార్టీతో కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి విజయం సాధించారన్నారు. కోడుమూరులో టీడీపీ గెలుపు, రాష్ట్రంలో చంద్ర బాబు ముఖ్యమంత్రి కావాలని గిడ్డాంజనేయస్వామికి కోరిన మొక్కును చెల్లిం చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణ, మద్ది లేటి, చిన్న, శ్రీరామ్, శాంత ప్పగారి క్రిష్ణ, జగన్, గిడ్డయ్య, రాఘవేంద్ర పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

సి.బెళగల్, జూన్ 8: మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో కొండపై వెలసిన కోన వేంకటేశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులకు శనివారం ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి శనివారం దూర ప్రాంతాల నుంచి భక్తుల పెద్ద సంఖ్యలో దేవుని దర్శనానికి వచ్చిన భక్తులకు అలయ కమిటీ ఉచితంగా అన్నదానం చేస్తుందన్నారు.

అక్షర శిల్పి రామోజీరావు

» ఆయన మరణం బాధాకరం

» టీడీపీ కార్యాలయంలో నివాళులు

కర్నూలు(అర్బన్), జూన్ 8: సమాజంలోని అన్ని వర్గాలకు రామోజీరావు మార్గదర్శిగా నిలిచి సేవలు అందించారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనాడు, ఈటీవీ, మార్గదర్శి చిట్స్, చలన చిత్ర రంగం, పచ్చళ్ల వ్యాపారంతో పాటు పలు సంస్థల్లో ఎందరికో ఉపాధి అవకాశాలు కల్పించారని కొనియాడారు. ప్రతి రోజు ఉదయాన్నే తాజా సమాచారంతో గ్రామాలతో పాటు దేశ, విదేశాల్లోని సమాచారం ప్రతి ఇంటికి చేరవేసి సమాజంలో జరుగుతున్న మంచి, చెడులు తెలియజేసే పెద్ద బాధ్యతతో పని చేశారన్నారు. ఎన్టీ రామారావు 9 నెలల్లో పార్టీని స్థాపించి, అధికారంలోకి రావడంలో రామోజీ కృషి ఎంతో ఉందన్నారు. ఎందరో మేధావులకు సూచనలు, సలహాలు ఇస్తూ రాష్ట్ర, దేశ రాజకీయాల్లో తన దైన ముద్రవేసుకున్న మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ముంతాజ్, తెలుగు యువత అధ్యక్షుడు అబ్బాస్, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు వి.హనుమంతరావు చౌదరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● రామోజీకి బీసీ సంక్షేమ సంఘం నివాళి

రామోజీరావు మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్ నివాళులు అర్పించారు. శనివారం నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో రామోజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితాంతం ప్రజల పక్షాన నిలిచి ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటు పడిన రామోజీరావుకు టీడీపీ తరపున ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రామోజీరావుకు గౌరు దంపతుల నివాళి

కల్లూరు: ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతికి పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, టీడీపీ నాయకుడు గౌరు వెంకటరెడ్డి శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈనాడు, ఈటీవీలో ప్రజలను చైతన్యవంతులను చేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా సేవ చేసిన మహనీయుడు రామోజీరావు అని గౌరుచరిత కొనియాడారు. పత్రికా రంగంలోనే కాకుండా హోటల్స్, సినిమా రంగాల్లో, రామోజీ ఫిల్మ్‌సిటీని స్థాపించి కీర్తి గడించారని తెలిపారు. రామోజీరావు ఆత్మకు శాంతి కలగాలని గౌరు చరిత ప్రార్థించారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పుసులూరు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రామోజీరావు సేవలు మరువలేనివి: టీజీ వెంకటేష్

కర్నూలు(ఎడ్యుకేషన్): పత్రికా రంగంలో ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు సేవలు మరువలేనివని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. స్థానిక మౌర్యఇన్‌లోని కార్యాలయంలో రామోజీరావు మృతికి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాభై ఏళ్ల క్రితం సైకిల్ తిరిగే సామాన్య వ్యక్తి పత్రికా రంగంలో ప్రవేశించి కొత్తపుంతలు తొక్కించారని అన్నారు. సామాన్య వ్యక్తి స్థాయి నుంచి ప్రపంచ మొత్తం గుర్తించుకునే వ్యక్తి వరకు చేరుకోవడం వెనుక ఆయన కష్టం ఎంతో ఉందన్నారు. రాజకీయాల్లోకి వచ్చిన ప్రజా నాయకులకు ప్రజా అవసరాలను తెలియజేస్తూ ప్రజలకు సేవ చేసేందుకు అవసరమైన సూచనలు అం దించడంలో ఎప్పుడూ ముందుండే వారని ఆయన సేవలను టీజీ కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పరమేష్, పామన్న, మాజీ కార్పొరేటర్లు గున్నా మార్క్, బాబు రాజ్, టీజీవీ ట్రేడ్ యూనియన్ నాయకులు సుబ్బారావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీపీఐ సంతాపం

కర్నూలు(న్యూసిటీ): ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతికి సీపీఐ జిల్లా సమితి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నట్లు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామోజీరావు అనారోగ్యంతో తుది శ్వాస విడిచారని, ఆయన అకాల మరణానికి సంతాపాన్ని ప్రకటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

● రామోజారావు మృతికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కే.రామాంజనేయులు ఒక ప్రకటనలో సంతాపాన్ని తెలిపారు. పత్రికా రంగం, సాహిత్యం, సినీ, టీవీ రంగాల్లో తనదయిన ముద్ర వేసి విశిష్ట సేవలందిం చారని కొనియాడారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతికి తెలియ జేశారు.

● డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్వచ్ఛ భారత్ రచ్చబండ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వి.శ్రీనివాసులు అధ్వర్యంలో రామోజీరావు మృతికి సంతాపం ప్రక టించారు. పాతబస్టాండు సమితి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రామోజీరావు పత్రిక ద్వారానే కాకుండా దేశంలోని అన్ని భాషల లో వార్తా సంస్థలను స్థాపించి తెలుగు ఖ్యాతిని దేశవాప్తంగా తెలియజేశారని కొనియాడారు. రామోజీ రావు మరణం తెలుగు రాష్ట్రాలకు, దేశానికి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ సి.గిరిధర్, టీఎన్‌టీయూఐసీ నాయకులు వై.నరసింహులు, వి.రాంబాబు పాల్గొన్నారు.

కర్నూలు(కల్చరల్): తెలుగు భాషాభివృద్ధికి, పత్రికా రంగం, సాహిత్యం కళల పురోగతికి కృషి చేసిన మహ నీయుడు ఈనాడు గ్రూప్స్ సంస్థల అధినేత రామోజీరావు అని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, నంది అవార్డు గ్రహిత పత్తి ఓబు లయ్య శనివారం ఒక ప్రకటనలో కొనియా డారు. రామోజీరావు మృతి పత్రికా, కళా సాహిత్య రంగాల వారికి దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. కొత్త నటు డు, కొత్త దర్శకులతో సినిమాలు తీసి విజయం సాధించారని గుర్తు చేశారు. అలాగే ఈటీవీలో పాడుతా తీయగా, జబర్దస్త్, ఢీ వంటి కార్యక్రమాలతో ఔత్సాహిక కళాకారులకు ప్రోత్సాహకాలు అందించారని పేర్కొన్నారు.




రామోజీరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న గౌరు దంపతులు



నివాళి అర్పిస్తున్న టీజీ వెంకటేష్



నివాళి అర్పిస్తున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు



మంత్రులెవరో..?

- కర్నూలు ఐదు స్థానాల్లో టీడీపీ కూటమి విజయం
- ఇందులో నలుగురు యువ అభ్యర్థులు
- బీవీ ఒక్కడే రెండోసారి ఎన్నిక
- మంత్రి పదవి రేస్‌లో పలువురు నేతలు
- ఉమ్మడి జిల్లాను పరిగణలోకి తీసుకుంటే అవకాశాలు తక్కువే
- మిత్రపక్షం కోటాలో బీజేపీ పార్థసారథికి చాన్స్ ఉండేనా..?



కర్నూలు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో టీడీపీ సునామి సృష్టించింది. కర్నూలు, నంద్యాల పార్లమెంట్ స్థానాలతోపాటు 12 అసెంబ్లీ స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఎన్టీఆర్ పార్టీని స్థాపించిన తర్వాత ఉమ్మడి జిల్లాలో ఇద్దరు ఎంపీలు, 12 మంది ఎమ్మెల్యేలు గెలవడం టీడీపీకి ఓ చరిత్ర. రాష్ట్రంలోనూ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయ దుందుభి మోగించింది. ఈ నెల 12న బుధవారం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. వేదిక, ముహూర్తం ఖరారు చేశారు. కర్నూలు పార్లమెంట్ నుంచి చంద్రబాబు కొలువులో మంత్రి కాబోతున్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన మంత్రులను ఎంపిక చేస్తే కర్నూలు జిల్లా ఎమ్మెల్యేకు అవకాశాలు తక్కువే. ఎందుకంటే నంద్యాల జిల్లాలో టీడీపీ క్లీన్‌స్వీప్ చేసింది. పైగా సీనియర్లు అందరూ అక్కడే ఉన్నారు. కర్నూలు జిల్లాలో బీవీ జయనాగేశ్వరరెడ్డి ఒక్కరే రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. టీజీ భరత్, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి తొలిసారిగా ఎమ్మెల్యేలుగా గెలిచారు. మిత్రపక్షం బీజేపీకి చాన్స్ ఇస్తే ఆదోని ఎమ్మెల్యే పార్థసారథికి మంత్రి పదవి వచ్చే అవకాశం ఉంది.

మిత్రపక్షం బీజేపీకి చాన్స్ ఇస్తే..



మిత్రపక్షం బీజేపీకి కనీసం రెండు మంత్రి పదవులు వచ్చే అవకాశం ఉంది. ఆ పార్టీలో ఎమ్మెల్యే సుజనా చౌదరి, అనంతపురం జిల్లా ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. బీజేపీలో బీసీ కోటాలో సత్యకుమార్, పార్థసారథి ఇద్దరిలో ఒకరికి చాన్స్ ఉంటుందని అంటున్నారు. వాల్మీకి కోటాలో ఎమ్మెల్యే సీటు దక్కించుకున్న పార్థసారథి అదే కార్డుతో చంద్రబాబు మంత్రివర్గంలో బెర్త్ ఖరారు చేసుకోవడానికి జాతీయ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే విజయవాడకు వెళ్లి టీడీపీ అధినేత చంద్రబాబును కలిసిన పార్థసారథి ఢిల్లీకి వెళ్లి బీజేపీ పెద్దలను కలుస్తున్నారు. శనివారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిశారు. మిత్రపక్షం కోటాలో బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథికి ఛాన్స్ ఉంటుందా..? అందరి నోటా ఇదే చర్చ.

ఐదుగురు ఎమ్మెల్యేల్లో బీవీనే సీనియర్



కర్నూలు పార్లమెంట్ పరిధిలో విజయం సాధించిన టీడీపీ కూటమి ఐదుగురు ఎమ్మెల్యేలలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి రెండు పర్యాయాలు గెలిచిన ఉన్నవారిలో సీనియర్. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, ప్రస్తుత టీడీపీ అధినేత చంద్రబాబు కుటుంబాలకు అత్యంత సన్నిహితుడైన దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి రాజకీయ వారసుడిగా 2014 ఎన్నికల్లో ఎమ్మిగనూరు నుంచి ఆయన తొలిసారిగా పోటీ చేసి విజయం సాధించారు. అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2019 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో మూడో పర్యాయం పోటీ చేసి విజయం సాధించారు. ప్రతి పార్లమెంట్ స్థానంలో ఒకరికి మంత్రివర్గంలో అవకాశం ఇవ్వాలని అధినేత చంద్రబాబు భావిస్తే బీవీ మోహన్‌రెడ్డి కుమారుడిగా, ఐదుగురు ఎమ్మెల్యేలో సీనియర్‌గా బీవీ జయనాగేశ్వరరెడ్డికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదే నియోజకవర్గం నుంచి వరుసగా ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన దివంగత మాజీ మంతి బీవీ మోహన్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీఆర్, చంద్రబాబు కాబినెట్‌లో ఆరుసార్లు కాబినెట్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. బీవీ జయనాగేశ్వరరెడ్డి సైతం తండ్రిబాటలో మంత్రి పదవి చేపట్టడం ఖాయం అంటూ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు.



బీసీ కోటాపై కేఈ శ్యాంబాబు ఆశలు



నంద్యాల జిల్లాలో ఆరు అసెంబ్లీ స్థానాల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలే గెలిచారు. మంత్రి పదవులు ఆశిస్తున్న సీనియర్లు ఆ సామాజిక వర్గానికి చెందినవారే ఉన్నారు. రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో ఓసీలకే అవకాశం ఇస్తారా..? బీసీ కోటాలో కేఈ శ్యాంబాబుకు అవకాశాలు లేకపోలేదని, ఆయన తండ్రి మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఉన్నారు.. కొడుకును మంత్రిగా చూడాలనే సంకల్పంతో కేఈ కృష్ణమూర్తి అధినేత చంద్రబాబుతో చక్రం తిప్పగలడని, ఆ కుటుంబం నుంచి కేఈ కృష్ణమూర్తి ఎన్టీఆర్, చంద్రబాబు కాబినెట్‌లో, కేఈ ప్రభాకర్ బాబు కాబినెట్‌లో ఇద్దరు కూడా మంత్రులగా పని చేసిన అనుభవం ఉంది. ఆ కోటలో శ్యాంబాబుకు అవకాశాలు ఉన్నాయంటూ పత్తికొండలో ప్రధానంగా చర్చించుకుంటున్నారు.

ఆర్యవైశ్య కోటాలో టీజీ భరత్



సామాజిక సమీకరణల కోటాలో అవకాశాలు ఉండవచ్చని కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్, పత్తికొండ కేఈ శ్యాంబాబు అనుచరులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా వీరిద్దరు కూడా తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచినవారే. రాష్ట్రంలో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన టీజీ భరత్, శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ఇద్దరే గెలిచారు. కర్నూలు నుంచి 1999లో టీడీపీ టికెట్‌పై, 2009లో కాంగ్రెస్ టికెట్‌పై రెండు పర్యాయాలు టీజీ వెంకటేశ్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు. టీజీ వెంకటేశ్ రాజకీయ వారసుడిగా 2019 ఎన్నికల్లో టీడీపీ పోటీ చేసిన టీజీ భరత్ స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఓటమి నుంచి విజయం వైపు అడుగుల వేయాలనే లక్ష్యంగా ఆ రోజు నుంచే వ్యూహాత్మకంగా పని చేశారు. తాజా ఎన్నికల్లో టీజీ భరత్ 18.876 ఓట్ల భారీ ఆధిక్యతతో విజయం సాధించారు. ఈయనకు యువనేత నారా లోకేశ్, అధినేత చంద్రబాబుతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. గెలిచిన వెంటనే యువనేత నారా లోకేశ్‌ను భరత్ కలిశారు. ఆర్యవైశ్య కోటాలో చంద్రబాబు కొలువులో బెర్త్ ఖాయని ఆయన వర్గీయులు అంటున్నారు.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన మంత్రి పదవులు ఇస్తే..

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా మంత్రి పదవులు కేటాయిస్తే.. కర్నూలు జిల్లాకు చంద్రబాబు క్యాబినెట్‌లో అవకాశాలు తక్కువ అని పార్టీలో చర్చ జరుగుతోంది. నంద్యాల జిల్లా నుంచి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే ఎన్ఎండీ ఫరూక్, బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మంత్రి పదవులు ఆశిస్తున్నారు. కోట్ల కేంద్ర మంత్రిగా, ఫరూక్, అఖిలప్రియలకు రాష్ట్ర మంత్రులగా పని చేసిన అనుభవం ఉంది. పార్టీ కష్టకాలంలో బీసీ అండగా ఉన్నారు. యువనేత నారా లోకేశ్ జిల్లాలో చేపట్టిన పాదయాత్రను అన్నీతానై ముందున్నారు. సీనియర్లగా ఈ నలుగురిలో ఇద్దరికి అవకాశం ఇస్తే.. కర్నూలు పార్లమెంట్‌కు చాన్స్ ఉండకపోవచ్చనే చర్చ చూడా ఉంది. అదే క్రమంలో అటు నంద్యాల, ఇటు కర్నూలు జిల్లాల పరిధిలో ఉంటున్న పాణ్యం నియోజకవర్గం నుంచి విజయం సాధించిన గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి దంపతులు వైసీపీలో కీలక అవకాశాలు వదులుకొని 2019లో టీడీపీలోకి వచ్చారు. చంద్రబాబు వారిని తప్పక గుర్తించి మంత్రివర్గంలో బెర్త్ ఖరారు చేస్తారని గౌరు వర్గీయులు పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి అమాత్యులు ఎవరనే ఉత్కంఠకు 12వ తేదీ తెరపడనుంది.



రామోజీరావుకి కలెక్టర్ దంపతుల సంతాపం

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 8: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత, మీడియా మొఘల్, పద్మ విభూషణ్ గ్రహీత అయిన రామోజీరావు మృతి పట్ల కలెక్టర్ దంపతులు డా.జి. సృజన, రవితేజ సంతాపం తెలియజేశారు. రామోజీరావు తెలుగు భాష కోసం, తెలుగు జాతి కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు.



రామోజీరావుతో కలెక్టర్ దంపతులు (ఫైల్)

చెప్పులు లేకుండా ఐదేళ్లు కాలినడక

కోసిగి, జూన్ 8: టీడీపీ అధికారంలోకి వచ్చే వరకు చెప్పులు వేసుకోనని ఓ కార్యకర్త శపథం బూనాడు. వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన ఆయన ఈ మేరకు ఐదేళ్లు చెప్పులు లేకుండా నడిచాడు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే మండల పరిధిలోని దొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గడ్డం గోపాల్‌పై వైసీపీ నాయకులు దాడి చేశారు. వైసీపీ నాయకుల దాడిలో తీవ్ర గాయాలపాలై గోపాల్ టీడీపీ అధికారంలోకి వచ్చే వరకు కాళ్లకు చెప్పులు వేసుకోనని శపథం బూనాడు. ఈ మేరకు కాళ్లకు చెప్పులు లేకుండానే తిరుగుతున్నాడు. టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాతనే కాళ్లకు చెప్పులు వేసుకుంటానని చెబుతున్నాడు.



కాళ్లకు చెప్పులు లేకుండా నడిచి వస్తున్న టీడీపీ కార్యకర్త గడ్డం గోపాల్

టిప్పర్ ఢీకొని జీవిత ఖైదీ మృతి

అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలు సమీపంలో ప్రమాదం

బుక్కరాయసముద్రం, జూన్ 8: అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలు వద్ద శనివారం టిప్పర్ ఢీకొని జీవిత ఖైదీ ఉప్పర ఈరన్న (50) మృతి చెందారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన ఈరన్న 2005లో తన భార్యను హత్య చేసిన కేసులో నిందితుడు. కోర్టులో నేరం రుజువు కావడంతో 2007లో జీవిత ఖైదు శిక్ష పడింది. కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తూ.. సత్ప్రవర్తనతో 2016లో అనంతపురం ఓపెన్‌ఎయిర్ జైలుకు వచ్చాడు. జైలుకు సంబంధించి వ్యవసాయ క్షేత్రంలో పనులు చేసేందుకు సైకిల్ మీద వెళుతుండగా వేగంగా వచ్చిన ఓ టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో ఈరన్న అక్కడిక్కడే మృతి చెందాడు. ఈరన్న 17 సంవత్సరాల నుంచి జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. కొత్త ప్రభుత్వంలో క్షమాభిక్షపై విడుదల అవుతానని తోటి ఖైదీలతో తరచూ అనేవాడు. ఇంతలోనే రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. ఈరన్న మృతితో ఓపెన్ ఎయిర్ జైలులో విషాదం నెలకొంది. ప్రమాదానికి కారణమైన ట్రిప్పర్ అనంతపురం నగరానికి చెందిన ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీది అని జైలు అధికారులు తెలిపారు. బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఓపెన్ ఎయిర్ జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ షఫీవుర్ రెహమాన్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాభివృద్ధిలో భాగం కావాలి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 8: గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు భాగస్వాములు కావాలని పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కే. సుబ్రమణ్యం సూచించారు. శనివారం జిల్లా పరిషత్ ఆవరణలోని విశ్వేశ్వరయ్య సమావేశభవనంలో గ్రామ సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్యసమావేశం జిల్లా అధ్యక్షుడు ఎం. మనోజ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కే.రవీంద్ర, జిల్లా అధ్యక్షుడు జీఎస్.గౌస్‌బాషా, ఎస్ఈ పీఏ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు క్రమశిక్షణతో పని చేయడంతో పాటు అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ సభ్యులు మోహన్‌రాజ్, సమీనా, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

కోట్ల హర్షా.. ఇక నీ రౌడీయిజం మానుకో..

- కార్యకర్తలపై దాడులు చేస్తే వదిలి పెట్టం
- మీ అరాచకాలతో విసిగి పోయి మాకు పట్టం కట్టారు
- ఎన్నికల్లో ఓటమి జీర్ణించుకోలేకే గ్రామాల్లో చిచ్చు
- కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, నియోజకవర్గం ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి

కర్నూలు(అర్బన్), జూన్ 8: వైసీపీకి ఓట్లు వేయలేదని .. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి దాడులకు తెగబడుతున్నారని, ఇకనైనా ఆయన తన రౌడీయిజాన్ని మానుకోవాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, నియోజకవర్గం ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో వారు కోడుమూరు మండలం కొత్తపల్లెలో దాడికి గురైన టీడీపీ కార్యకర్తలతో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూకబ్జాలు, రౌడియిజం చేస్తూ పచ్చని గ్రామాల్లో అరాచకాలు చేస్తే ..ఇక వదలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. ఎరుకలి సామాజిక వర్గానికి చెందిన వారి పేరుతో దాడులకు తెగబడేలా చేస్తే ఎవరూ భయపడే ప్రసక్తి లేదని అన్నారు. ఎరుకలి సామాజిక వర్గం వైసీపీ నాయకులకు కొమ్ముకాస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. శుక్రవారం రాత్రి కొత్తపల్లి గ్రామానికి చెందిన రాధాక్రిష్ణతో పాటు మరో ఆరుగురిపై దాడులకు పాల్పడిన 17 మంది వైసీపీ కార్యకర్తలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారే దాడులు చేసి ముందస్తుగా టీడీపీ కార్యకర్తలపై రివర్స్ కేసులు పెట్టేందుకు ముందస్తుగా ఆస్పత్రిలో చేరి హడావిడి చేశారని, దీనికి ఎవ్వరూ భయపడే ప్రసక్తి లేదన్నారు. ప్రతి టీడీపీ కార్యకర్తకు అండగా ఉంటామని అన్నారు. వైసీపీ అరాచకాలకు ప్రజలు విసిగిపోయి తమకు పట్టం కట్టారనే సంగతి ఆ పార్టీ నాయకులు గ్రహించాలని అన్నారు. అనంతరం కోడుమూరు, కొత్తపల్లి గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, బాధితులతో ఎస్పీ కార్యాలయాలనికి వెళ్లారు.



మాట్లాడుతున్న నియోజకవర్గం ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి

అదనపు కట్నం వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల, జూన్ 8 : పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన మౌనిక తనను అదనపు కట్నం కోసం భర్త, అత్త,మామలు వేధిస్తున్నారని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మాసూమ్ శనివారం తెలిపారు. ఎనిమిదేళ్ల క్రితం తుగ్గలి మండలం శభాష్‌పురం గ్రామానికి చెందిన రవీంద్రనాథ్‌తో సంజీవనగర్‌కు చెందిన మౌనికకు వివాహమైందన్నారు. అదనపు కట్నకానుకల కోసం భర్త రవీంద్రనాథ్, అత్త రామేశ్వరమ్మ, మామ రాజులు వేధింపులకు గురి చేస్తున్నారని బాధితురాలు ఫిర్యాదు చేసిందని, ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ముగిసిన ఓపెన్ స్కూల్ పరీక్షలు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 8: జూన్ 1వ తేదీన ప్రారంభమైన ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారంతో ముగిశాయి. పదో తరగతి పరీక్షకు మొత్తం విద్యార్థులు 261 మంది రిజిస్టర్ చేసుకున్నారు. 217 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 44 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఇంటర్ పరీక్షకు 689 మంది రిజిస్టర్ చేసుకున్నారు. 597 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వీరిలో 92 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూయేల్ నాలుగు పరీక్ష కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్ పది, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 3 పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదని డీఈవో వివరించారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు డీఈవో శామ్యూయేల్ తెలిపారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.7.81 లక్షలు

బేతంచెర్ల, జూన్ 8: మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలోని మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.7.81 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడు శనివారం తెలిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాల నుంచే గాక. తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.7,81,770 ఆదాయం దేవస్థానానికి లభించినట్లు వారు తెలిపారు.

రస్తాలో బోరు వేసిన వైసీపీ నాయకుడు

రుద్రవరం, జూన్ 8 : మండలంలోని టి. లింగందిన్నె గ్రామంలో వైసీపీ నాయకుడు వీరశేఖర్‌రెడ్డి గవర్నమెంటు రస్తాలో బోరు వేసినట్లు సర్పంచ్ లక్ష్మీదేవి శనివారం రాత్రి తెలిపారు. ఈ విషయంపై రుద్రవరం ఎస్ఐ నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. గవర్నమెంటు రస్తాలో దౌర్జన్యంగా బోరు వేసి దేవునిమాన్యంలో పైపులైను ఏర్పాటు చేయించేందుకు ప్రయత్నిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని ఎస్ఐని కోరారు.

వాటర్ హీటర్ షాక్‌తో మహిళ మృతి

కోసిగి, జూన్ 8: వాటర్ హీటర్ షాక్‌తో నాగజ్యోతి (36) అనే మహిళ మృతి చెందింది. ఈ ఘటన శనివారం కోసిగిలో జరిగింది. కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో సాయిబాబా దేవాలయం దగ్గర నివాసం ఉంటున్న ఏఎన్ఎం రాధ కుమారుడి పుట్టిన రోజు వేడుకలకు ఆమె చెల్లెలు నాగజ్యోతి అనంతపురం వచ్చింది. రాధ షాపింగ్ కోసం భర్త విజయ్‌తో కలిసి ఆదోనికి వెళ్లింది. నాగజ్యోతి బాత్‌రూమ్‌లో ఉన్న వాటర్ హీటర్ కరెంటు షాక్‌తో అక్కడే కుప్పకూలి పోయింది. చాలా సేపటి తర్వాత పక్కింటి వారు గుర్తించి ఆమెను కోసిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి 108 వాహనంలో ఆదోనికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించగా.. ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్త కిరణ్, రెండు సంవత్సరాల కుమారుడు ఉన్నారు. ఆదోని అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాటుసారా ధ్వంసం

బేతంచెర్ల, జూన్ 8: బేతంచెర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన 32 కేసుల్లో 1020 లీటర్ల నాటుసారా, 5 ఎక్సైజ్ కేసుల్లో 750 ఎంఎల్ 96 వివిధ బ్రాండ్ల మద్యం ఫుల్ బాటిల్స్‌ను, 180 ఎంఎల్ 28 క్వార్టర్స్ బాటిల్స్‌ను శనివారం పోలీసులు ధ్వంసం చేశారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు సీఐ ప్రియతమ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ శివశంకర్ నాయక్ సిబ్బందితో కలిసి పోలీస్‌స్టేషన్ వెనుక ప్రాంగణంలో ట్రాక్టర్ ద్వారా ధ్వంసం చేసినట్లు తెలిపారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు
● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్...

హొళగుంద, జూన్ 8: కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి హొళగుంద మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ అయ్యే విధంగా చర్యలు తీసుకున్నట్లు హొళగుంద ఎమ్ఈవో జగన్నాథ్ శనివారం తెలిపారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేసేందుకు ఒకటి నుంచి ఆరవ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు, ఏడు నుంచి పదవ తరగతి వరకు నోటు పుస్తకాలు వచ్చాయని తెలిపారు. అలాగే 8,876 మంది విద్యార్థుల కోసం బ్యాగులు సిద్ధం చేసినట్లు తెలిపారు. గత ఏడాది మాదిరిగానే 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

లోకేశ్‌ను కలిసిన యువ నాయకులు



నారా లోకేశ్‌ను కలిసిన టీడీపీ యువనాయకులు

ఆదోని, జూన్ 8: మంగళగిరి ఎమ్మెల్యే టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌ను తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, మారుతి నాయుడులు ఉండవల్లిలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం మంగళగిరికి ఎమ్మెల్యేగా ఎన్నుకోబడినందున మర్యాదపూర్వకంగా కలిసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రావటం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా ఆదోనిలో కూటమి పొత్తులో భాగంగా బీజేపీ అభ్యర్థిని గెలిపించుటకు కృషి చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆదోని నియోజకవర్గం ప్రజానికానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నారా లోకేష్‌ని కలిసిన వారిలో యువనాయకులు మారుతి నాయుడు, పోలినేని సూర్యనారాయణ, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, వినయ్, లోకేష్, రఘు, రామకృష్ణ ఉన్నారు.

ఆదోని అభివృద్ధికి సహాయం చేయండి



భారత మాజీ కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పార్థసారధి

ఆదోని, జూన్ 8: ఆదోని అభివృద్ధికి సహాయం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి కోరారు. శనివారం ఢిల్లీలోని మాజీ కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల సమయంలో తన ప్రచారం కోసం ఆదోని వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఆదోని అభివృద్ధికి ఆశీస్సులు ఉండాలని అభ్యర్థించినట్లు పేర్కొన్నారు.

ఈదురు గాలులతో వర్షం

ఎమ్మిగనూరు రూరల్/ పెద్దకడుబూరు, జూన్8: ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు మండలాల్లో శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఎమ్మిగనూరు మండలంలో 4.2మి.మీ వర్షాపాతం నమోదైంది. అలాగే పెద్దకడుబూరు మండలంలో 8.2 మి.మీ వర్షాపాతం నమోదైంది. రెండు మండలాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో రైతులు పంటపొలాల పనుల్లో నిమగ్నమయ్యారు.

కోడుమూరు ఎమ్మెల్యేను మంత్రి వర్గంలోకి తీసుకోవాలి

పెద్దకడుబూరు, జూన్8: కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి బొగ్గుల నరసన్న కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ కోడుమూరులో 40ఏళ్లుగా లేని టీడీపీ గెలిపించడంతో పాటు జిల్లాలోనే అత్యధిక మెజార్టీని సంపాదించారన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన బొగ్గుల దస్తగిరికి మంత్రి వర్గంలో స్థానం కల్పిస్తే పార్టీ బలోపేతానికి, ప్రజల కష్టాలు తీర్చేందుకు కృషి చేస్తారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సింగిల్ విండో అధ్యక్ష పదవికి రాజీనామా

తుగ్గలి, జూన్ 8: మారెళ్ల సొసైటీ సింగిల్ విండో అధ్యక్షుడిగా పని చేస్తున్న అట్ల గోపాల్ రెడ్డి తన పదవికి రాజీనామా చేసి సీఈవో నాయుడుకు అందించారు. శనివారం మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్ సహకార సొసైటీలో సింగిల్ విండో ఛైర్మన్ అట్ల గోపాల్‌రెడ్డితో పాటు డైరెక్టర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను డివిజనల్ కోఆపరేటివ్ అధికారికి అందిస్తామని సీఈవో తెలిపారు.

కూటమితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

● జనసేన ఇన్‌చార్జి లక్ష్మన్న

మంత్రాలయం, జూన్ 8: రాష్ట్రంలో దౌర్జన్యపాలనకు ప్రజలు చరమగీతం పాడి కూటమికి అధికారం కట్టబెట్టారనీ, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమితోనే సాధ్యమవుతుందని మంత్రాలయం నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి, రాష్ట్ర ఐక్యవాల్మీకి పోరాట కమిటి రాష్ట్ర అధ్యక్షులు, బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ కన్వీనర్ బి.లక్ష్మన్న అన్నారు. శనివారం నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో, జనసేన పార్టీ కార్యాలయంలో మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి, పెద్దకడుబూరు, మంత్రాలయం, కౌతాళం మండలాలకు చెందిన జనసైనికులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్డీయే కూటమి రాష్ట్రంలో, కేంద్రంలో విజయం సాధించినందుకు రాష్ట్రంలో కీలకంగా జనసేనాని పవన్ కళ్యాణ్ గర్వించదగ్గ విషయమని కొనియాడుతూ లక్ష్మన్నతో కేక్ కట్ చేసి శాలువ, పూలమాలతో సన్మానం చేశారు. సమావేశంలో జనసేన నాయకులు ఏసేబు, గణేష్, వీరారెడ్డి, సుమిత్ర, ముని, అబ్రహం, చిన్న, రాజు, ఎర్రిస్వామి, ఉమేష్, అయ్యప్ప, గోపాల్, శివరాజు, హనుమంతు, లింగప్ప, శాంతి పాల్గొన్నారు.



అగసనూరు సమీపంలోని ఆర్డీఎస్ ఆనకట్టపై దిగువకు పారుతున్న వరద నీరు

కోసిగి, జూన్ 8: కొద్ది రోజులుగా చుక్కనీరు లేక వెలవెలబోయిన ఆర్డీఎస్ ఆనకట్ట.. నేడు ఎగువ, దిగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు జలకళ సంతరించకుంది. పై ప్రాంతాల నుంచి వరద నీరు ఆర్డీఎస్ ఆనకట్టకు చేరడంతో ఆనకట్టపై నుంచి నీరు దిగువకు ప్రవహిస్తూ కళకళలాడుతోంది. దీంతో నదీతీర గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో చుక్కనీరు లేక తుంగభద్ర నది ఒట్టిపోవడంతో.. వర్షాలు సమృద్ధిగా కురవడంతో శనివారం ఆర్డీఎస్‌కు వరద నీరు చేరింది. నూతన ప్రభుత్వం ఏర్పాటు సమయంలో వర్షాలు బాగా కురిసి తుంగభద్ర నదికి నీరు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నీరు పారుతుండడంతో ఆర్డీఎస్ ఆనకట్టపై కొంగలు సందడి చేస్తూ చూపరులను కట్టిపడేస్తున్నాయి.

ఎల్లెల్సీకి చేరిన నీరు

హాలహర్వి : కురుస్తున్న వర్షాల వల్ల ఎల్లెల్సీ కాలువలో జలకళ సంతరించుకుంది. మొన్నటి వరకు వెలవెలబోయిన ఎల్లెల్సీ కాలువ మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పొలాల్లో నీరంతా కాలువలో వచ్చి చేరుతోంది. ప్రస్తుతం పారుతున్న నీరు తుంగభద్ర జలాశయం నుంచి రాలేదని, వర్షపు నీరని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ కాలువలో నీరు ప్రవహిస్తుండటంతో పశువులకు, గొర్రెలకు, పక్షులకు తాగునీటి సమస్య తీరందని ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఊపందుకున్న పత్తి విత్తు

● 30వేల హెక్టార్లలో పత్తి సాగుకు సిద్ధం



పత్తి విత్తనాలు విత్తేందుకు భూమిని సిద్ధం చేస్తున్న రైతులు

గోనెగండ్ల, జూన్ 8: ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతన్నలు పత్తి, పంట పైనే ఆశలు పెట్టుకున్నారు. అడప దడప వర్షాలు కురుస్తుండటం మృగశిర కార్తి రావడంతో తొలకరి జల్లులు కురియడం, సాగుకు అనుకూలం అని రైతన్నలు పత్తి విత్తనాలు విత్తేందుకు సిద్ధమయ్యారు. శనివారం నియోజకవర్గంలోని పలు మండలాలలో పత్తి సాగు ఊపందుకుంది. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో దాదాపు 30 వేల హెక్టార్లలో పత్తి సాగుకు సిద్ధమవుతున్నారు.

రైతులపై వజ్రాల అన్వేషకుల దాడి

తుగ్గలి, జూన్ 8: ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వజ్రాల అన్వేషకులు తమ పొలాల్లోకి రావద్దని రైతులు అడ్డుకుంటుంటే.. రైతులపై దాడులకు ప్రయత్నిస్తున్నారు. హెచ్చరిక బోర్డులు పెట్టినా పట్టించుకోవడం లేదు. శనివారం మండల జొన్నగిరిలో వజ్రాల అన్వేషకులు రైతుల పొలాల్లో వజ్రాల కోసం అన్వేషిస్తుండగా.. 'తమ పొలాల్లో తిరగొద్దని, విత్తన సమయం వచ్చిందని విత్తనాలు విత్తేందుకు ఇబ్బందిగా మారుతుందని' రైతులు కోరగా వజ్రాల అన్వేషకులు వాగ్వాదానికి దిగి దాడులకు ప్రయత్నించారు. దీంతో అక్కడికి చేరుకున్న రైతు నాగార్జునతో పాటు మరికొందరు వజ్రాన్వేషికులను పొలాల నుంచి పంపించేశారు. దాడులకు ప్రయత్నించిన వారిని జొన్నగిరి పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రెండేళ్ల నుంచి వజ్రాల కోసం తమ పొలాలల్లో తిరగవద్దని హెచ్చరిక బోర్డులు పెట్టినా అన్వేషికులు పట్టించుకోవడం లేదని, ఇలా అయితే.. తమ పొలాలు పంటల సాగుకు పనికి రావని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీసులు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు పూర్వపు విద్యార్థుల సమ్మేళనం

ఎమ్మిగనూరు, జూన్8: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1981-82 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వపు విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించనున్నట్లు పూర్వపు విద్యార్థులు వైష్ణవి విద్యాసంస్థల అధినేత జీడీ లింగప్ప, మల్లెల గ్రూప్స్ ఛైర్మన్ మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్వపు విద్యార్థులు ఆదివారం ఉదయం 10గం లకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేరుకోవాలని కోరారు.

వీఆర్ఓ పై దాడి - కేసు నమోదు

వెల్దుర్తి, జూన్, 8 : గ్రామ రెవెన్యూ అధికారి ప్రసాద్ పై దాడికి యత్నించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం పొలం సంబంధిత సమస్యపై మాట్లాడుతుండగా వెల్దుర్తి గ్రామానికి చెందిన వ్యక్తులు మౌలాలి, నాగసురేంద్ర దుర్భాషలాడుతూ దాడిచేసేందుకు ప్రయత్నించారన్నారు. వీఆర్ఓ ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నూతన ప్రభుత్వం చొరవ చూపాలి

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 8: ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కొత్తగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం చొరవ చూపాని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు సి. నాగరాజు కోరారు. శనివారం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీ అమలుపరిచే లోగా, ఉద్యోగ ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల్లేవ్..

● ఆందోళనలో అన్నదాతలు



మద్దికెర, జూన్ 8: పుష్కలంగా వర్షాలు కురుస్తున్నాయి. దుక్కులు దున్ని పొలాలను రైతులు సిద్ధం చేసుకున్నారు. వర్షం ఆగిపోతే విత్తన సాగుకు సిద్ధంగా ఉన్నారు. ఆర్‌బీకే కేంద్రాల్లో ఎరువుల్లేకపోవడంతో రైతులు అల్లాడుతున్నారు. మండలంలో మొత్తం 11 గ్రామాలున్నాయి. 7,500 హెక్టార్ల సాగుభూమి ఉంది. పెరవలి, మద్దికెర, బురుజుల, ఎం.అగ్రహారం గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ఇప్పటికే ఆరంభమై కొంత మంది రైతులు బోరుబావుల కింద వేరుశనగ పంటను సాగు చేశారు. ఎరువులు లేకపోవడంతో పట్టణ ప్రాంతాలకెళ్లి మందులు తెచ్చుకొని సేద్యం చేస్తున్నారు. అలాగే వర్షాధారం కింద వేరుశనగ, కంది పంటల సాగుకు సేద్యం పూర్తి చేసుకుని విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉన్నారు. ముఖ్యంగా వేరుశనగ విత్తనాలు విత్తే సమయంలో ఆ తర్వాత పూత పిండే దశలో మందులు ఎక్కువగా వాడతారు. రైతుభరోసా కేంద్రంలో యూరియా కానీ, డీఏపీ పొటాష్ కానీ 102626, 143114, 2020013 మందులు రైతులకు చాలా అవసరం. కానీ ఆర్బీకేల్లో ఏ మందులు లేవు. దీంతో ప్రైవేటు దుకాణాల్లో మందులు కొనుగోలు చేస్తున్నారు. స్థానికంగా మందులు లేకపోవడంతో గుంతకల్లు, పత్తికొండ, ఆదోని ప్రాంతాలకు వెళ్లి ఎరువులు తెచ్చుకుంటున్నారు. ఈ విషయంపై వ్యవసాయాశాఖ అధికారి ఉప్పరి రవి మాట్లాడుతూ మందులు ప్రస్తుతానికి నిల్వ లేవని, అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, కోరమాండల్ ద్వారా రైతులకు విత్తన పంపిణీ చేస్తామని వివరణ ఇచ్చారు.

ఓటమే విజయానికి నాంది

● కష్టపడ్డ టీడీపీ కార్యకర్తలకు న్యాయం చేస్తా
● మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి



కోసిగి టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

కోసిగి, జూన్ 8: ఓటమే విజయానికి నాంది అని, ఓటు వేసిన వారికి, వేయని వారికి, కార్యకర్తలకు అండగా ఉండి అన్ని కులాలకు న్యాయం చేస్తామని టీడీపీ మంత్రాలయం అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం కోసిగిలోని అయ్యప్పస్వామి దేవాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అఖండ మెజారిటీతో 164 సీట్లలో విజయకేతనం ఎగురవేసిందని, ఈ నియోజకవర్గంలో ఓడిపోవడం చాలా బాదాకరమని పేర్కొన్నారు. ఈసారి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అనుకున్నామని, అయినా కూడా ఎక్కడ తప్పు జరిగిందో తెలియదని పూర్తిగా విచారణ చేసి అధిష్టానానికి తెలియజేస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్.రామక్రిష్ణారెడ్డి, ముత్తురెడ్డి, రామిరెడ్డి, రామక్రిష్ణ, జ్ఞానేష్, చింతలగేని నరస్సారెడ్డి, అయ్యన్న, వక్రాణి వెంకటేశ్, తాయన్న, ఈరన్న, కోసిగయ్య, గౌస్, రాముడు, ఈరేష్, పోతుల వీరారెడ్డి, గణపతి, తదితరులు ఉన్నారు.

జైన సన్యాసుల పాదయాత్ర

వెల్దుర్తి, జూన్, 8 : ప్రజలు అహింసా మార్గంలో నడవాలన్న సందేశంతో దిగంబర జైన సన్యాసులు చేపట్టిన పాదయాత్ర శనివారం డోన్ మీదుగా వెల్దుర్తికి చేరుకుంది. బెంగుళూరు నుంచి అంతర్మాన గురుదేవ్ ఆచార్య శ్రీ 108 ప్రసన్న సాగర్జీ మహరాజ్ జీ సంసంద్ తరపున 15 మంది సాధువులు ఒంటిపై నూలు పోగు లేకుండా పాదయాత్ర చేస్తున్నారు. వీరు హైదరాబాదు మీదుగా గోమతేశ్వరం అక్కడ నుంచి కుల్పారం చేరుకోనున్నట్లు పాదయాత్ర భక్తులు తెలిపారు. పాదయాత్ర చేస్తున్న జైన సన్యాసులను పలువురు దర్శించుకొని ఆశీస్సులు తీసుకున్నారు.

15న ఆదర్శ ప్రవేశ పరీక్షలు

మద్దికెర, జూన్ 8: 2024-25 విద్యాసంవత్సరానికి గానూ స్థానిక ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో ఖాళీ ఉన్న వాటికి ఈ నెల 15న పాఠశాలలో ప్రవేశ పరీక్షలు ఉంటాయని ప్రిన్సిపల్ కే.సరిత తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఖాళీలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ పరీక్షలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

13న దేవాలయ భూముల వేలం

మద్దికెర, జూన్ 8: మద్దికెర గ్రామంలో చెన్నకేశవస్వామి దేవాలయ భూములు ఈ నెల 13వ తేదీన వేలం పాటలు వేయడం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ దేవాలయానికి చెందిన దాదాపు 43 ఎకరాలు వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.5వేలు ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మూడేళ్ల పాటు కౌలుకు చేసుకోవచ్చన్నారు. వివరాల కోసం 94924 05817కు సంప్రదించాలని సూచించారు.

మద్దికెరలో దంచి కొట్టిన వాన



బురుజుల వంక ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం

మద్దికెర, జూన్ 8: మద్దికెర గ్రామంలో శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మండలంలోని బురుజుల గ్రామంలో శుద్ధబాయి వంక హోసూరు వెళ్లే దారిలో వంకలు దాదాపు 2 గంటలపాటు వరదనీటితో ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రయాణీకులు, ద్విచక్రవాహనదారులు అవతలివైపు, ఇవతలివైపు ఉన్నారు. గతంలో ఈ వంక ద్వారా ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. శుద్ధబాయి వంక బ్రిడ్జి ఎత్తు పెంచాలని పలుమార్లు అధికారులు, నాయకులను కోరినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. దీంతో భారీ వర్షాలు వచ్చిన ప్రతిసారి ప్రయాణీకులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. మండలంలో దాదాపు 3 సెం.మీల మేర వర్షం కురిసింది.

రాయితీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

వెల్దుర్తి, జూన్ , 8 : ఖరీఫ్ సాగుకు రాయితీ పై వేరుశనగ, కందులు, కొర్రలు విత్తనాలను ప్రభుత్వం అందిస్తోందని మండల వ్యవసాయాధికారి అక్బర్‌బాషా తెలిపారు. శనివారం రామళ్లకోట గ్రామంలో రైతుభరోసా కేంద్రంలో రైతులకు రాయితీ విత్తనాలను పంపిణీ చేశారు. మండలానికి తగినన్ని విత్తన నిల్వలు ఉన్నాయన్నారు. రైతులు తమ దగ్గర్లో ఉన్న రైతు భరోసా కేంద్రంలో సంప్రదించి రాయితీ పై విత్తనాలను పొందాలన్నారు.

కేంద్ర మంత్రివర్గంలో కర్నూలు ఎంపీకి స్థానం కల్పించాలి

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 8: కేంద్ర మంత్రివర్గంలో కర్నూలు టీడీపీ ఎంపీగా అఖండ విజయం సాధించిన బస్తిపాటి నాగరాజుకు స్థానం కల్పించాలని టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి, 26 వార్డు ఇన్‌చార్జి కురువ మల్లికార్జున డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం శుభపరిణామం అన్నారు. బస్తిపాటి నాగరాజుకు కేంద్రమంత్రిగా అవకాశం కల్పిస్తే సీఎం చంద్రబాబు సహకారంతో మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

కోసిగి, జూన్ 8: మండల పరిధిలోని దుద్ది గ్రామానికి చెందిన ఎండపల్లి మూకయ్య, నాగేంద్రమ్మ దంపతులకు చెందిన రేకుల గుడిసె శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. గుడిసెలో ఉన్న రూ.50వేల నగదు, రూ.20వేలు విలువ చేసే టీవీ, ఏడు ప్యాకెట్ల బియ్యం, బట్టలు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు.

బీవీ విజయం ప్రజా విజయం



గోనెగండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

గోనెగండ్ల, జూన్ 8: ఎమ్మిగనూరు నియోజక వర్గంలో బీవీ జయనాగేశ్వరరెడ్డి విజయం ప్రజా విజయం అని మండల టీడీపీ కన్వీనర్ నజీర్‌సాహెబ్, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్యనాయుడు అన్నారు. శనివారం మండల కేంద్రమైన గోనెగండ్లలో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చింతలాముని నల్లారెడ్డి దేవాలయం దగ్గరకు ర్యాలీ గా వెళ్లారు. ప్రత్యేక పూజలు చేసి 101 టెంకాయలు సమర్పించారు.



కోసిగిలో రామోజీరావుకు మృతికి సంతాపం తెలుపుతున్న టీడీపీ నాయకులు



ఆలూరులో టీడీపీ కార్యాలయంలో నివాళి



ఆస్పరిలో టీడీపీ, జనసేన,బీజేపీ, జర్నలిస్టుల నివాళి



ఎమ్మిగనూరు టీడీపీ కార్యాలయంలో నివాళి



పెద్దకడుబూరులో టీడీపీ నాయకుల నివాళి



పత్తికొండలో కమ్మ సంఘంనాయకుల నివాళి



దేవనకొండ టీడీపీ కార్యాలయంలో..

అక్షర యోధునికి అశ్రు నివాళి

ఈనాడు సంస్థల అధినేత రామోజీ గ్రూప్‌ఆఫ్ ఛైర్మన్ అక్షర యోధుడు రామోజీరావుకు జిల్లా వ్యాప్తంగా రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు, జర్నలిస్టులు అశ్రు నివాళి అర్పించారు. మీడియా రంగంలో రామోజీరావుది ప్రత్యేకమైన శకమని కొనియాడారు. ఆయన మృతి పత్రికా రంగానికి, రాష్ట్రానికి తీరనిలోటని పేర్కొన్నారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలువేసి, ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని నివాళి అర్పించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్